ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలపై విచారణ

విచారణ జరుపుతున్న విజిలెన్స్ అధికారులు

బచ్చన్నపేట, అక్టోబర్ 8 : పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో అవకతవకలు జరిగాయని వచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం విజిలెన్స్ అధికారులు మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. 2020-21 యాసంగి కొనుగోళ్లలో అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఆరోపణలు రావడంతో విజిలెన్స్ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎఫ్ఆర్‌వో గౌతమ్ రైతులతో విచారణ జరిపారు. భూమి లేకున్నా ధాన్యం కొనుగోలు డబ్బులు వేసినట్లు సదరు వ్యక్తి చేసిన ఫిర్యాదుపై వారు స్పందించారు. అవకతవకలపై విచారణ జరిపామని, నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పులిగిళ్ల పూర్ణచందర్, సీఈవో బాలస్వామి, రైతులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలి : కలెక్టర్

జనగామ చౌరస్తా, అక్టోబర్ 8 : భూముల లే అవుట్ క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్) సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్ సింగ్‌తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా, కాకతీయ అర్బన్ డెవెలప్‌మెంట్ అథారిటీ (కుడా) పరిధిలో ఉన్న చిల్పూరు, స్టేషన్ ఘన్‌పూర్, జఫర్‌గఢ్ మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ మూడు మండలాల పరిధిలో 7433 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఇందులో 633 దరఖాస్తుల సర్వే పూర్తయిందని, మిగిలిన 6800 పెండింగ్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. గ్రామాలు, మండలాల వారీగా ట్రాక్ షీట్లతో యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని సూచించారు.

హైవేపై మద్యంషాపును తొలగించాలి

ఎక్సైజ్ సూపరింటెండెంట్ అనితకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జనగామ రూరల్, అక్టోబర్ 8: మండలంలోని పెంబర్తిలో జాతీయ రహదారి పక్కన యూటర్న్ వద్ద మద్యం షాపు ఉండడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని సీపీఎం నాయకులు తెలిపారు. దీని నివారణకు వైన్‌షాపును మరో చోటికి తరలించాలని కోరారు. ఈ విషయమై మంగళవారం ఎక్సైజ్ సూపరింటెండెంట్ అనితకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జనగామ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ మాట్లాడుతూ మద్యం షాపు సమీపంలోనే యూటర్న్ ఉండడం, రేయింబవళ్లు షాపును నిర్వహిస్తున్నారని తెలిపారు. మద్యం ప్రియుల సిట్టింగ్‌లు కొనసాగుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నందున సాయి సంధ్య వైన్స్‌ను అక్కడి నుంచి తరలించాలని, డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బూడిదె గోపి, భూక్యా చందు, బొట్ల శ్రావణ్, పాము శ్రీకాంత్, సురేశ్, పొత్తునూరి కనకాచారి పాల్గొన్నారు

తహసీల్దార్‌ను కలిసిన రజక సంఘం నాయకులు

తహసీల్దార్‌ను సత్కరిస్తున్న నాయకులు

లింగాలఘనపురం, అక్టోబర్ 8 : తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రవీందర్‌ను మండలానికి చెందిన రజక సంఘం నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏదునూరి వీరన్న, ఏదునూరి నాగరాజు, దేవరకొండ శంకరయ్య, ఏదునూరి సోమనర్సయ్య పాల్గొన్నారు.

ఉత్తమ బతుకమ్మల ఎంపికకు పోటీలు

సమావేశంలో మాట్లాడుతున్న అంజయ్య

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 8 : స్పోర్ట్స్ అండ్ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలో బతుకమ్మ పోటీలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు అక్కనపల్లి అంజయ్య తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక హనుమాన్ టెంపుల్ వద్ద నిర్వహించే సద్దుల బతుకమ్మ ఉత్సవాల్లో ఉత్తమ అలంకరణ బతుకమ్మలను గుర్తించి బహుమతులను అందిస్తామన్నారు. సమావేశంలో స్పోర్ట్స్ కన్వీనర్ పెసరు సారయ్య, కల్చరల్ కన్వీనర్ ఉబ్బని మల్లేశం, దారం రాజు, గోళి రాజశేఖర్, డాబర్ రమేశ్, యాకూబ్ పాషా, రజాక్, ప్రభాకర్, రాజేశ్, సాయి, పవన్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

HOUSE FOR SALE

★కాకతీయ యూనివర్సిటీ దగ్గర్లో, Reliance Smart Pointకి సమీపంలో నెలకు 25K Rents వచ్చే North East Facingలో గల G+1 ఇల్లు (221 Sq.yds) అమ్మకానికి కలదు. సంప్ర: సెల్: 8639002604.
NTW-326343

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331785-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

బైకులు ఢీకొని వ్యక్తి మృతి

తరిగొప్పుల, అక్టోబర్ 8: ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. స్థానిక ఎస్సై అయ్యాల శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అక్కరాజుపల్లికి చెందిన గొలుసుల రాములు(70) మంగళవారం మండల కేంద్రానికి బైక్‌పై వచ్చాడు. అనంతరం తిరిగి వెళ్తుండగా అక్కరాజుపల్లి క్రాస్ వద్ద జనగామకు చెందిన నారోజు విక్రమ్ బైక్‌పై అతివేగంతో వస్తూ ఢీకొట్టాడు. ఈ ఘటనలో రాములు మృతి చెందారు. గాయపడిన విక్రమ్‌ను హైదరాబాద్‌కి తరలించినట్లు ఎస్సై తెలిపారు.


స్టేషన్‌ఘన్‌పూర్, రఘునాథపల్లిలోని ప్రభుత్వ దవాఖానల్లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మహిళా వైద్యులు, సిబ్బంది

ముందస్తు బతుకమ్మ, దసరా సంబురాలు

- ప్రభుత్వ దవాఖానల్లో వేడుకలు
- ఆడిపాడిన వైద్యులు, సిబ్బంది

స్టేషన్ ఘన్‌పూర్/రఘునాథపల్లి, అక్టోబర్ 8 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ప్రభుత్వ దవాఖానల్లో ముందస్తు బతుకమ్మ, దసరా సంబురాలు నిర్వహించారు. స్టేషన్ ఘన్‌పూర్‌లోని ప్రభుత్వాసుపత్రి ఆవరణలో మంగళవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధీర్ నేతృత్వంలో సీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, సిబ్బంది బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. మహిళా వైద్యులు, సిబ్బంది తెలంగాణ సంప్రదాయాలు ఉట్టిపడేలా తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలతో ఆడిపాడారు. దీంతో ప్రభుత్వాసుపత్రిలో పండుగ వాతావరణం కనిపించింది. ఈ కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్లు జనార్దన్, సంధ్య, సౌక్య, ఎల్‌టీ సృజన, సరిత తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపల్లి పీహెచ్‌సీలో..

రఘునాథపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. వైద్యులు, సిబ్బంది కలిసి తీరొక్కపూలను సేకరించారు. తంగేడు, గునుగు, గుమ్మడి, బంతి పూలతో బతుకమ్మలను పేర్చారు. అనంతరం ఆట పాటలతో నృత్యాలు చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రామ్‌కిషన్, డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెదమడూరులో ఏడొద్దుల సద్దుల బతుకమ్మ

బతుకమ్మ ఆడుతున్న మహిళలు

దేవరుప్పుల, అక్టోబర్ 8: మండలంలోని పెదమడూరులో ఏడొద్దుల సద్దుల బతుకమ్మ సంబురాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. దవాబ్దాలుగా ఇక్కడ ఏడు రోజులకే సద్దుల బతుకమ్మను జరుపుకోవడం ఆనవాయితీ. పూర్వం తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మను వాగులో జరుపుకుంటున్న క్రమంలో గ్రామానికి నిప్పంటుకుని ఇళ్లు దగ్ధమయ్యాయి. ఈ అరిష్టాన్ని అధిగమించడానికి అప్పటి నుంచి పెదమడూరులో ఏడో రోజే సద్దుల బతుకమ్మ ఆడడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ నేపథ్యంలో మంగళవారం గ్రామంలో సద్దుల బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. వందలాది బతుకమ్మలతో ఆడబిడ్డలు శోభాయాత్రగా తరలి రాగా ఘనంగా వేడుకలు కొనసాగించారు.

పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా నరేందర్, ప్రకాశం

నరేందర్

ప్రకాశం

జనగామ చౌరస్తా/స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబర్ 8 : పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా బోడ నరేందర్, కొల్లూరు ప్రకాశం ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన స్టేట్ కౌన్సిల్ సమావేశంలో వీరిని ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు బోడ నరేందర్ యాదవ్ మాట్లాడుతూ పీఆర్టీయూ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. మరోవైపు స్టేషన్ ఘన్‌పూర్ మండలం చాగల్ హైస్కూల్‌లో అసిస్టెంట్ మ్యాథ్స్ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ప్రకాశం మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ రఘు, మండల కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రపంచ చరిత్రను మలుపుతిప్పిన సాయుధ పోరాటం


దర్గ్యానాయక్‌తో నాగసూరి వేణుగోపాల్ బృందం

దేవరుప్పుల, అక్టోబర్ 8: ప్రపంచ చరిత్రలో తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రత్యేక స్థానముందని సీనియర్ సైన్స్ రచయిత, జర్నలిస్ట్, అకాశవాణి పూర్వ సంచాలకులు డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం మండలంలోని కడవెండి, దేవరుప్పుల, కామారెడ్డిగూడెం, ధర్మాపురం ప్రాంతాలను ఆయన సందర్శించారు. వేణుగోపాల్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ పోరాటంపై ఆసక్తితో ధర్మాపురంలో ధానూనాయక్, కడవెండిలో దొడ్డి కొమురయ్య, కామారెడ్డిగూడెంలో షేక్ బందగీ స్తూపాలను సందర్శించానని తెలిపారు. ధానూనాయక్ తమ్ముడు శతాధిక వృద్ధుడైన దర్గ్యానాయక్‌ను స్వయంగా కలిసి నాటి వీర గాథలపై చర్చించారు. చారిత్రక ప్రాంతాల్లో క్షేత్ర సందర్శన చేసి రచనలకు అవసరమైన సమాచారం సేకరించే ఉద్దేశంతో ప్రపంచ పోరాటాల చరిత్రల్లో మైలురాయిగా నిలిచిన తెలంగాణ రైతాంగ పోరాటాన్ని అక్షరబద్ధం చేస్తున్నట్లు ఆయన వివరించారు. నాటి పోరాటాల్లో స్వయంగా తుపాకి పట్టిన దర్గ్యానాయక్ చెప్పిన నిజాలు మరువలేనివన్నారు. ఆయన వెంట సహచరి హంసవర్ధిని, తెలంగాణ రైతాంగ పోరుపై పరిశోధన చేసిన ఉస్మానియా యూనివర్సిటీ చరిత్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పన్నీరు రమేశ్, జర్నలిస్ట్ కన్నారపు శివశంకర్, స్థానిక విద్యాధికారి కళావతి, కన్నారపు పరశురాములు, వెన్నెల, చరిత్ర, అమూల్య ఉన్నారు

డీజేలపై నిషేధ నిర్ణయాన్ని సర్కారు ఉపసంహరించాలి

పాలకుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న డీజే నిర్వాహకులు

పాలకుర్తి,అక్టోబర్ 8: రాష్ట్ర వ్యాప్తంగా డీజే సౌండ్స్‌ను నిషేధిస్తూ సర్కారు తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం మండల కేంద్రంలో డీజే నిర్వాహకులు ర్యాలీ నిర్వహించారు, రాజీవ్‌చౌరస్తా నుంచి గుడివాడ చౌరస్తా వరకు నినాదాలు చేస్తూ ప్రదర్శన కొనసాగించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు వంగరి అశోక్ మాట్లాడుతూ డీజేలపై ఆధారపడిన కుటుంబాలకు సర్కారు న్యాయం చేయాలన్నారు .ప్రభుత్వం పునరాలోచన చేసి డీజేలపై విధించిన నిషేదంను ఎత్తివేయాలన్నారు. పండుగల సీజన్, ఇతర శుభకార్యాలకు, రాజకీయ పార్టీల సమావేశాలకు డీజేలు వినియోగించడం వల్ల వేలాది కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో డీజేల నిర్వాహకులు నిర్వ హించిన పాత్రను వివరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి డీజేలపై నిషేధాన్ని ఎత్తివేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల అ ధ్యక్షుడు సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా జిల్లా కమిటీ ఎన్నిక

జనగామ చౌరస్తా, అక్టోబర్ 8 : అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఇర్రి అహల్య, ఎండీ షబానా, సహాయ కార్యదర్శులుగా కల్యాణి, భవాని, సౌందర్య, ఉపాధ్యక్షులుగా నిర్మల, శ్రీలత, కార్యవర్గ సభ్యులుగా అంజమ్మ, అనిత, రాములమ్మ, రజిత, కావ్య, మమత, రమాదేవి, రమ, పూలమ్మ, మంగమ్మతో పాటు మరో 17 మంది ఎన్నికయ్యారు. నూతన కమిటీ బాధ్యులు మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం పరిశ్రమలను ఏర్పాటు చేసి మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. డ్వాక్రా మహిళలు అభయహస్తంకు కట్టిన డబ్బులు తిరిగి ఇవాలని సూచించారు. జిల్లా కేంద్రంలో మూడో విడుత ఇందిరమ్మ ఇండ్లు కట్టుకున్న వారికి ఇంటి నంబర్లు, కరెం ట్, మంచినీటి వసతి కల్పించాలని డిమాండ్ చేశారు.

ఉద్యమకారుల ఫోరం కోఆర్డినేటర్‌గా రాంబాబు

పాలకుర్తి, అక్టోబర్ 8: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కో-ఆర్డినేటర్‌గా మండలంలోని వల్మిడికి చెందిన మోకాటి రాంబాబుని నియమించారు. ఈ మేరకు ఫోరం రాష్ట్ర చైర్మన్ చీమ శ్రీనివాస్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2019లో కొద్ది మందితో ఏర్పడిన తెలంగాణ ఉద్యకారుల ఫోరం మన ఆత్మగౌరవం, సంక్షేమమే ధ్యేయంగా అమరుల లక్ష్య సాధనకు రాంబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఫోరం చైర్మన్ శ్రీనివాస్, సభ్యులకు ఉద్యమకారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పంటలకు కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి

సమావేశంలో మాట్లాడుతున్న మోకు కనకారెడ్డి

నర్మెట, అక్టోబర్ 8: ఆరుగాలం కష్టం కష్టించి రైతులు పండించిన పంటలకు కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా కొనుగోలు చేయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు అనేక కష్టనష్టాల కోర్చి పండించిన పంటలను వ్యాపారులు తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. పత్తికి మద్దతు ధర క్వింటాలుకు రూ.7,525 ఉండగా వ్యాపారులు కేవలం రూ.6 వేలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని ఆయన తెలిపారు. రైతులు నష్టపోకుండా ఉండేందుకు సీసీఐ ద్వారా పత్తిని కొనుగోలు చేయించాలని కోరారు. ఐకేపీ, మార్క్‌ఫెడ్‌ల ద్వారా వరి, మక్కలు కొనుగోలు చేయాలని కోరారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సీసీఐ ద్వారా కొనుగోలు చేయించడంలో నిర్లక్ష్యం వ్యవహరిస్తే పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ప్రజ్ఞపురం నర్సింహులు, నాయకులు పండుగ రాజారాం, కొన్నె రవీందర్, బండి కర్ణాకర్, సంగి గట్టయ్య, సిద్ధులు, మల్లేశ్, శ్రీను, మురళి, లింగం పాల్గొన్నారు.

కన్నుల పండువగా దేవీ నవరాత్రి ఉత్సవాలు

మహాలక్ష్మీ దేవి, దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు జిల్లావ్యాప్తంగా వేడుకలు

తాటికొండలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడవెండిలో యాగం నిర్వహిస్తున్న యూత్ సభ్యులు

నర్మెట, అక్టోబర్ 8 : దేవీ నవరాత్రోత్సవాలు మండలంలో ఘనంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంతో పాటు మచ్చుపహాడ్, వెల్దండ, హన్మంతాపూర్‌లో 'శ్రీమహాలక్ష్మీ' అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దేవరుప్పులలో..

దేవరుప్పుల : మండలంలోని కడవెండిలో సంస్కార్ యూత్ ఆధ్వర్యంలో దేవీ నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వానకొండయ్య లక్ష్మీనర్సింహ స్వామి ఆలయ అర్చకుడు బీట్కూరు సంపత్కుమారాచార్య ఆధ్వర్యంలో చండీ యాగం కొనసాగించారు. యూత్ సభ్యులంతా భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. గ్రామస్తులు చండీయాగాన్ని తిలకించి అన్నప్రసాదాలను స్వీకరించారు.

జనగామ రూరల్‌లో..

జనగామ రూరల్ : మండలంలోని పెంబర్తిలో దుర్గామాత శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చింది. అమ్మవారి అలంకరణ అనంతరం మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలను అర్చకులు అందించారు. ఉత్సవ కమిటీ మహాన్నదానం చేసింది.

వెల్దండ, పెంబర్తిలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

స్టేషన్‌ఘన్‌పూర్‌లో..

స్టేషన్ ఘన్‌పూర్ : మండలంలోని తాటికొండ కనకదుర్గ పరమేశ్వరి ఆలయంలో దేవీ శరవన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆరో రోజు అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పురోహితుడు జీడికంటి వరుణాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చన నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పండుగ బుచ్చయ్య, కనకయ్య, పర్శరాజు, రాములు, నారబోయిన గోపాల్, నాగరాజు, రవి, ఉప్పలయ్య, రాంబాబు, సుధాకర్ పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి తొమ్మిది నెలల జైలు

జనగామ అర్బన్ సీఐ దామోదర్‌రెడ్డి వెల్లడి

జనగామ చౌరస్తా, అక్టోబర్ 8 : జిల్లా కేంద్రంలోని బాలాజీ నగర్‌లో గతేడాది స్కూటీని చోరీ చేసిన నిందితుడికి తొమ్మిది నెలల జైలు శిక్షతో పాటు రూ.100 జరిమానా విధిస్తూ జనగామ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జీ ఈ సుచరిత తీర్పు ఇచ్చారు. దీనికి సంబంధించిన వివరాలను అర్బన్ సీఐ దామోదర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం .. నల్గొండ జిల్లా చండూరు మండలం నర్మెటకు చెందిన నారపాక దశరథ గతేడాది ఆగస్టు 15న జనగామ పట్టణం బాలాజీ నగర్‌లో నివాసముంటున్న లోనె మహేందర్‌జీ ఇంటికి తాళం వేసి తిరుపతికి వెళ్లగా, ఆ ఇంట్లోకి అక్రమంగా చొరబడి స్కూటీని చోరీ చేశాడు. ఈ ఘటనపై అప్పటి అర్బన్ ఎస్సై జీ అరుణ్‌కుమార్ కేసు నమోదు చేసి ఛార్జీషీటు దాఖలు చేయగా, మంగళవారం జడ్జి సుచరిత తీర్పు వెల్లడించినట్లు సీఐ తెలిపారు.

మహేందర్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

బాధిత కుటుంబాలకు ఎర్రబెల్లి పరామర్శ

దేవరుప్పుల, అక్టోబర్ 8: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. కోలుకొండకు చెందిన బీఆర్ఎస్ యూత్ నాయకుడు కోతి ప్రవీణ్ తల్లిదండ్రులు కోతి సోమ్మల్లయ్య, పద్మ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో ఎర్రబెల్లి బాధితుల ఇంటికి వెళ్లి పరామర్శించారు. అప్పిరెడ్డిపల్లిలో బీఆర్ఎస్ కార్యకర్త నాగంపల్లి మహేందర్ కుమార్తె లిఖిత(18)బ్రెయిన్ ట్యూమర్‌తో ఇటీవల మృతి చెందింది. ఈ క్రమంలో లిఖిత చిత్రపటానికి ఎర్రబెల్లి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల నాయకులు పల్లా సుందరరాంరెడ్డి, బస్వ మల్లేశ్, మాజీ ఎంపీపీ కొల్లూరు సోమయ్య, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చింత రవి, మాజీ సర్పంచ్‌లు పులిగిల్ల సుధాకర్, మహ్మద్ ఖాసీం, మైదం జోగేశ్వర్, ఏల సుందర్, కాంటూరి సత్యం, వంగ అర్జున్, పాము మోహన్, ఉసిరిపల్లి కొండాజీ, బానోత్ నవీన్, యాకయ్య, ప్రభాకర్, సుధాకర్‌రెడ్డి, జనగామ సంతోష్ ఉన్నారు

నేడు కలెక్టరేట్‌లో బతుకమ్మ వేడుకలు

జనగామ చౌరస్తా, అక్టోబర్ 8 : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం 4 గంటలకు బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన చేశారు. కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలకు చెందిన మహిళా ఉద్యోగులు ఈ వేడుకల్లో పాల్గొనాలని పేర్కొన్నారు. ఉత్తమ బతుకమ్మలను తయారు చేసిన వారికి బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు.

ఇద్దరికి ఉపాధ్యాయ ఉద్యోగాలు

భానుచందర్

నసీరుద్దీన్

దేవరుప్పుల, అక్టోబర్ 8: 2024-డీఎస్సీ ఫలితాల్లో మండలంలో ఇద్దరు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. కడవెండికి చెందిన రేషపల్లి భానుచందర్‌కు స్కూల్ అసిస్టెంట్(తెలుగు)గా ఎంపికకాగా, దేవరుప్పులకు చెందిన మహ్మద్ ఖాజానసీరుద్దీన్ హిందీ పండిట్‌గా సెలక్టయ్యారు. వీరు ఎనిమిదేళ్లుగా ప్రైవేట్ స్కూల్‌లో టీచర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఎట్టకేలకు అదే వృత్తిలో ఉద్యోగం రావడంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు వీరు నేడు నియామక పత్రాలు అందుకుంటుండగా పలువురు అభినందించారు

బీజేపీ పాలనలో పెరిగిన నిరుద్యోగం : సీపీఎం

గోవర్ధనగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

రఘునాథపల్లి, అక్టోబర్ 8: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాలనలో ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేట్‌పరం అవుతున్నాయని, నిరుద్యోగం మరింతగా పెరుగుతున్నదని సీపీఎం మండల కార్యదర్శి గంగాపురం మహేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని గోవర్ధనగిరిలో ఆ పార్టీ గ్రామ మహాసభ గొడుగు గోపయ్య అధ్యక్షతన జరిగింది. మహేందర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచడంతో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరలు లభించడంలేదని, దళారీ వ్యవస్థతో అన్నదాతలు ఆర్థికంగా చితికిపోతున్నారని ఆయన వివరించారు. నిత్యం పేద ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న సీపీఎంను ప్రజలు ఆదరించాలని ఆయన కోరారు. అనంతరం గ్రామ నూతన కార్యదర్శిగా కండ్లకోల శివకుమార్‌ను ఎన్నుకున్నారు . ఈ కార్యక్రమంలో బడికే అశోక్, కుమ్మెర సుధ, ఆమనగంటి రేణుక, ఇల్లందుల స్వప్న మునగాల నరసమ్మ, మహేశ్, శ్రావణ్ పాల్గొన్నారు.

నమిలిగొండలో మద్యం పట్టివేత ..?

స